క్లుప్తంగా

నీటిసంఘాల ఎన్నికలకు సిద్ధంకండి

నందిగాం: వీఆర్వోలంతా త్వరలో జరగనున్న నీటిసంఘాల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ వి.సోమేశ్వరరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీర్వోలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో నీటి సంఘం ఎన్నికలకు సంబంధించి పలుసూచనలు చేశారు. మండల పరిధి నీటి సంఘ ఓటర్లను గుర్తించాలని, ప్రాదేశికాల వారీగా ఓటర్ల జాబితాలను తయారు చేయాలని, ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించాలన్నారు.

రోప్ స్కిప్పింగ్ పోటీలకు మర్రిపాడు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో పీఈటీ

సంతబొమ్మాళి: భీమవరంలో ఈనెల ఏడు నుంచి తొమ్మిదో తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్–17 విభాగంలో జె.ఢిల్లేశ్వరి, అండర్–14 విభాగంలో బి.శాంతిలు పాల్గొంటారని పీఈటీ వెంకటరమణ బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను స్థానిక సర్పంచ్ అట్టాడ కల్పన, హెచ్‌ఎం జానకీ రామయ్య, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● ఎక్సైజ్ సీఐ బేబీ



సోంపేట: మద్యం దుకాణ యజమానులు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని సోంపేట ఎక్సైజ్ సీఐ కె.బేబీ అన్నారు. తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్కిల్ పరిధిలో ఉన్న 12 లైసెన్స్ దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయించాలన్నారు. ఎవరైనా అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని, బెల్టు దుకాణాలకు మందు అమ్మితే తొలిసారి రూ.5లక్షల జరిమానా విధిస్తామని.. రెండవసారి నేరం రుజువైతే లైసెన్స్ రద్దు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. దుకాణాల వద్ద తాగడానికి పర్మిట్లు ఇవ్వలేదన్నారు. సర్కిల్ పరిధి ఒడిశా సరిహద్దు కావడంతో నాటు సారా కేసులు ఎక్కువగా ఉన్నాయన్నారు. దీన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

హౌసింగ్ గ్రీవెన్స్‌కు 12 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో బుధవారం నిర్వహించిన అర్బన్ హౌసింగ్ గ్రీవెన్స్‌కు 12 వినతులు వచ్చాయి. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నడిపేన రామారావు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వారం వివిధ సమస్యలపై 12 ఆర్జీలు వచ్చాయని వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ప్రజలు హౌసింగ్ సమస్యలపై నిర్వహించే గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



పరామర్శలో ఎంపీపీ, దేవదాస్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

కంచిలి: పి.శాసనాం గ్రామానికి చెందిన 16 మంది కూలీలు సోంపేట మండలం బారువ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వీరిలో మామిడిపల్లి గాయిత్రి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో మృతురాలు కుటుంబాన్ని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. వజ్జ మృత్యుంజయరావు, స్థానిక సర్పంచ్ గుడ్డిపద్ర వేణు, ఎంపీటీసీ సభ్యుడు దుర్గాసి మాధవరావు, కేశవపాత్రో, కొణపల సురేష్ ఉన్నారు.

కాశీబుగ్గలో విజుబుల్ పోలీసింగ్



ద్విచక్ర వాహనం నడుపుతున్న బాలుడికి కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ మోహనరావు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలలో కాశీబుగ్గ పోలీసులు విజుబుల్ పోలిసింగ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం ఐదు నుంచి రాత్రి పది గంటల వరకు చేపట్టిన కార్యక్రమంలో సీఐ మోహనరావు పాల్గొన్నారు. చిన్నపిల్లలు వాహనాలు నడపడం, బహిరంగంగా మద్యం తాగడం, గంజాయి అక్రమ రవాణా, వివాదాస్పద వ్యక్తుల సంచారంపై ఆర్మ్‌డ్ పోలీసులతో కలిసి ఆరా తీశారు. వాహనాలు నడుపుతున్న చిన్నపిల్లలకు కౌన్సెలింగ్ చేశారు.

బైపాస్ నుంచి వెళ్లిపోతున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సు



బైపాస్ మీదుగా రయ్..రయ్..!

కంచిలి:

● కంచిలి పట్టణంలోకి రాని ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులు
● మండల కేంద్రాన్ని తప్పిస్తున్న వైనం
● ప్రయాణికులకు ఇక్కట్లు
● పట్టించుకోని అధికారులు

ఉత్తరాంధ్రలో ప్రముఖ కొబ్బరి వ్యాపార కేంద్రంగా పేరొందినటువంటి కంచిలి మండల కేంద్రం ప్రజలు ప్రయాణ కష్టాలను ఎదుర్కొంటున్నారు. కంచిలి పట్టణాన్ని తప్పించి, బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటి నుంచి ఆర్టీసీ, ప్రైవేటు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు జాతీయ రహదారి మీదుగా బైపాస్‌లోనే వెళ్లిపోతున్నాయి. ఎంతో ప్రాధాన్యత కలిగినటువంటి కంచిలి పట్టణ కూడలిలోకి ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సులు రాకపోవడంతో వేలాదిమంది ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రహదారి సౌకర్యం లేని గ్రామాలకు సైతం చెప్పిన వెంటనే బస్సు సర్వీసులు కల్పిస్తామని చెబుతున్న ఆర్టీసీ అధికారుల మాటలకు ఇక్కడ ప్రయాణికులకు జరుగుతున్న అన్యాయానికి పొంతన లేకుండా పోయింది. ఇక్కడ ఏర్పడిన ఈ విచిత్ర పరిస్థితిని స్థానిక ప్రయాణికులు అనేకసార్లు ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి విన్నవించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ముఖ్యంగా బరంపురం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే ఆర్టీసీ, ప్రైవేటు ఎక్స్‌ప్రెస్ బస్సులు చాలా కాలంగా బైపాస్ నుంచే వెళ్లిపోతున్నాయి. అలాగే ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడకు వెళ్లే కొన్ని ఎక్స్‌ప్రెస్‌లు, లగ్జరీ, సూపర్ లగ్జరీ సర్వీసులు సైతం రావడం లేదు. బరంపురం–పర్లాకిమిడి, పర్లాకిమిడి–బరంపురం వెళ్లే ప్రైవేటు సర్వీసులు సైతం సోంపేట పట్టణంలోనికి రావడం లేదు. దీంతో ప్రయాణికులు జాతీయ రహదారి వద్ద లగేజీల వెళ్లడం, అటు నుంచి వచ్చేటప్పుడు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళ ఒక్కరు వచ్చినా ఎంత రాత్రయినా చీకట్లో బైపాస్‌లో నిర్లక్ష్యంగా దించేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుసార్లు ప్రజాప్రతినిధులు నుంచి వార్తాపత్రికల్లో కథనాలు రావడంతో కొద్దిరోజులపాటు అన్ని సర్వీసులు కంచిలి మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు. తర్వాత మళ్లీ యథాలాపంగా బైపాస్‌లోనే రాకపోకలు సాగించడంపైన స్థానిక ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని వలన దూరప్రాంతాలైన విశాఖపట్నం, శ్రీకాకుళం, అటు బరంపురం వంటి ప్రాంతాలకు వైద్య, విద్యా అవసరాలకు వెళ్లేవారు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కంచిలి మీదుగా రాకపోకలు సాగించేలా ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పట్టణంలోకి బస్సు సర్వీసులు నడపాలి



మండల కేంద్రం కంచిలి పట్టణంలోకి ఆర్టీసీ, ప్రైవేటు బస్సు సర్వీసులు నడపాలి. చాలా కాలంగా ఇక్కడ ఏర్పడిన ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. దీని వలన స్థానిక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. సమస్యను సత్వరమే పరిష్కరించాలి.

–రాజు, రైల్వే ఉద్యోగి, కంచిలి

చాలా దారుణం



కంచిలి పట్టణంలోకి పూర్తి స్థాయిలో ఆర్టీసీ, ప్రైవేటు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు రాకుండా నిలిపివేయడం అత్యంతదారుణం. దీని వలన ప్రయాణికులు ఎన్నో అవస్థలు పడుతున్నారు. దీనిపైన సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపట్టకుండా కంటితుడుపుగా కొద్దిరోజులు ఆయా సర్వీసులు పునరుద్ధరించి, తర్వాత ఆపివేసి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపైన వెంటనే చర్యలు చేపట్టాలి.

–వంకల ఉమాపతి, ఉపసర్పంచ్, పురుషోత్తపురం గ్రామం, కంచిలి

రైతు ఓటర్ల జాబితా విడుదల



రైతు ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న ఎంపీపీ పుష్ప తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: సాగునీటి సంఘాలకు వివిధ దశల్లో ఎన్నికలు జరుగుతాయని ఎంపీపీ బోర పుష్ప చెప్పారు. టి.బరంపురం రైతు సేవా కేంద్రంలో రైతు ఓటర్ల జాబితాను బుధవారం విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు ఈ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాగునీటి వనరుల అభివృద్ధిని నీటి సంఘాల ఆధ్వర్యంలోనే జరుగుతాయని, నీటి సరఫరా పరిస్థితి, ఆయకట్టు పరిధిలో ఏ సమస్య వచ్చినా వారే చూసుకుంటారని అన్నారు. సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఒడిశా మద్యంతో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: బిర్లంగి గ్రామానికి చెందిన వ్యక్తి ఒడిశా మద్యం బాటిళ్లను తరలిస్తుండగా అరెస్టు చేసినట్టు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.డి.ప్రసాద్ తెలిపారు. బిర్లంగి గ్రామం వద్ద బుధవారం తనిఖీలు నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన రత్నాల భగవాన్‌దాస్ తొమ్మిది ఒడిశా మద్యం బాటిళ్లతో పట్టుబడినట్లు పేర్కొన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేశామన్నారు.



పచ్చని ప్రయాణం..

పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి సముద్ర తీరానికి చేరుకునేందుకు ఉపయోగించే అక్కుపల్లి రోడ్డు ఆహ్లాదాన్ని పంచుతోంది. రోడ్డుకు ఇరువైపులా పచ్చని పందిరివేసినట్లు ఉన్న చెట్లు ప్రయాణికులను ఆకట్టుకుంది. పలాస–అక్కుపల్లి మధ్యలో గరుడభద్ర కూడలి వద్దది ఈ చిత్రం. వేసవిలో చాలామంది ప్రయాణికులు ఇక్కడ సేదదీరుతుంటారు.

–కాశీబుగ్గ



ఎస్‌జీఎఫ్ ఆపన్నహస్తం

మండల కేంద్రం కవిటి పంచాయతీ పొడియాపుట్టుగకు చెందిన ఒంటరి మహిళ జలంత్ర రాధ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. ఈ విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ సంస్థ సభ్యులు ఆమెకు అండగా నిలిచారు. రూ. పది వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు.

–కవిటి



ప్రమాద మలుపు..

టెక్కలి మండలంలోని గూడేం పంచాయతీ పరిధి నీలాపురం గ్రామం వద్ద రోడ్డు మలుపు ప్రమాదకరంగా మారింది. తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. టెక్కలి నుంచి మెళియాపుట్టి వెళ్లే వాహనదారులకు అటుగా వచ్చే వాహనాలు కనిపించక ఒకరినొకరు ఢీకొట్టుకోవడంతో ప్రమాదాల బారినపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామం సమీపంలో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయడంతోపాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

–టెక్కలి రూరల్



విద్యార్థులకు అభినందన

రాజమండ్రి, ఏలూరు, కర్నూలులో ఈ నెల ఎనిమిది నుంచి పదో తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం డి.నాగభూషణ్ తెలిపారు. అండర్ –17, అండర్ 19 విభాగాల్లో సెపక్‌తక్రా క్రీడల్లో పాలం భవానీ శంకర్, బగడ ఉదయ్ చరణ్ తేజ్, లావేటి మణికంత, సత్తారు కిరణ్‌కుమార్, వాకామూరి యోగి, ఉప్పాడ ప్రభాస్, చిరంజీవి ప్రధానో ఎంపికవ్వగా.. వారిని పీడీలు కె.కె.రామిరెడ్డి, జగ్గమ్మ అభినందించారు.

–టెక్కలి

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందజేయాలి



బ్యాంక్‌ను పునఃప్రారంభిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి: బ్యాంకింగ్ రంగంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందజేయాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. టెక్కలి యూనియన్ బ్యాంక్‌ను బుధవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు, మహిళలకు, ఇతర వర్గాల వారికి ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ, పెట్టుబడి రుణాలను సకాలంలో అందజేసి వారి ఆర్థిక పురోభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఖాతాదారుల కోసం సాంకేతిక పరిజ్ఞానంతో బ్రాంచ్‌ను ఆధునీకరించడం సంతోషకరమని.. ఆయా సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ అధికారి వెంకటతిలక్, ఎల్‌డీఎం ఎం.సూర్యకిరణ్, బ్రాంచ్ మేనేజర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది నిరసన



నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

కాశీబుగ్గ: నష్టాల పేరుతో ఆర్టీసీ బస్సుల సంఖ్యను తగ్గించి ప్రైవేటును ప్రోత్సహిస్తున్నారని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలాస డిపోలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. విశాఖపట్నం, ఇచ్ఛాపురం ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, పల్లె వెలుగులు కలిపి 21 బస్సులు నిలిపివేశారని అన్నారు. డిపోలో పనిచేసిన వారికి, ప్రయాణికులకు మంచినీటి సమస్య వెంటాడుతోందని, ఇచ్ఛాపురం కాంప్లెక్స్‌లో రెస్ట్ రూమ్ సమస్య ఉందని వీటిని పరిష్కరించాలన్నారు. పలాస నుంచి విశాఖపట్నానికి గతంలో మూడు ప్రైవేటు బస్సులు మాత్రమే ఉండేవని ఇప్పుడు 25 అయ్యాయని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎం.ఎ.రాజు, కార్యదర్శి ఏడీ కుమార్, టీసీహెచ్ రావు, జీకే రాజు, వి.డి.రావు, పి.ఎల్.నారాయణ, మురళి ఉన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై ఒత్తిడి పెట్టడం తగదని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మార్చుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లండ బాబూరావు, బమ్మిడి శ్రీరామమూర్తి అన్నారు. సోంపేటలో విలేకరులతో బుధవారం మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర విధులు రద్దు చేస్తామంటూనే అనేక పనులు అప్పగించడం తగదన్నారు. పనులు చేయడానికి సమయం ఇవ్వకుండా జిల్లా, మండలస్థాయి అధికారులు ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. సాంకేతిక కారాణాలతో వలన పనులు జరగకపోయినా ఉపాధ్యాయులను బాధ్యులు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తూ అపార్‌ను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో రైజ్ సంస్థల ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. విశాఖపట్టణం మహాత్మగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఉద్దానం ప్రాంతంలోని ప్రజలు ఎక్కువగా గుట్కా, పాన్‌పరాగ్, కిల్లీ, ఖైనీ వంటివి ఎక్కువగా వాడుతున్న కారణంగా అధికంగా నోటిక్యాన్సర్ వంటి అనారోగ్యాలకు గురవుతుంటారన్నారు. వీటిని దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. రైజ్ సంస్థల అధినేత డాక్టర్ ప్రవీణ్ పుల్లట, ఆస్పత్రి వైద్యసిబ్బంది దేవేంద్రరెడ్డి, సంతోషి, టీడీపీ నాయకులు జాని, సాలిన డిల్లి, దిలీప్, తవిటయ్య ఉన్నారు.

శాకాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

కవిటి: శాకాహారం తీసుకోవడం ద్వారానే మెరుగైన ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించగలమని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ మూమెంట్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు అన్నారు. శిలగాంతో పాటు పరిసరాల్లోని 15 గ్రామాల పరిధిలో ఈ అంశమై విస్తృతస్థాయిలో ఇంటింటా ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. ఆధునిక పోటీ ప్రపంచంలో వ్యాయామానికి దూరమవడంతో వ్యాధులు పంజా విసురుతున్న తరుణంలో ప్రజలంతా శాకాహారులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. మితాహారం తీసుకోవడం, యోగా, ధ్యానం తదితర అంశాలను జీవనవిధానంలో నిరంతర సాధన ద్వారా ఆరోగ్యానికి బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

హాకీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



అఖిలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కంచిలి: కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని సూరిశెట్టి అఖిల ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో హాకీలో చక్కని ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు అర్హత సాధించింది. ఈమె అండర్ 14వ విభాగంలో గత నెల 22వ తేదీన జిల్లా స్థాయిలో ఆడి ఎంపికయ్యింది. ఈ నెల 8, 9, 10 తేదీల్లో అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుంది. హెచ్‌ఎం సీతారాంనాయుడు, ఉపాధ్యాయులు కిశోర్ ఖడంగా, క్రిష్ణారావు, పీడీ రోజారమణిలు విద్యార్థిని అఖిలను అభినందించారు.

శబ్ద కాలుష్యంపై ఫిర్యాదు

కాశీబుగ్గ: మండల కేంద్రమైన మందస మేజర్ పంచాయతీలోని కొండివీధిలో శబ్ద కాలుష్య సృష్టిస్తున్నారని స్థానిక నిరుద్యోగ యువత తెలిపారు. ఈ మేరకు మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్సీ, రైల్వే, గ్రూప్స్ ఉద్యోగాలకు సిద్ధమవుతుండగా.. వేకువజామున మైకుల్లో పెద్ద శబ్దం చేస్తూ, పాటలు పాడుతూ కొంతమంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మైకులు వాడకుండా సహకరించాలని కోరారు.

కళాకారులను ప్రోత్సాహించాలి

ఇచ్ఛాపురం రూరల్: కళాకారులను ప్రభుత్వం ప్రోత్సాహించాలని మహతీ సాంస్కృతిక కళాసేవా సంస్థ ప్రధాన కార్యదర్శి తిప్పన ధనుంజయరెడ్డి కోరారు. టి.బరంపురం సీతారాముల ఆలయం వద్ద కళాకారులు సమారాధన మహోత్సావాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మంది కళాకారులచే స్వర నీరాజనం జరిగింది. ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ఎన్ని దేవరాజును సత్కరించారు. సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, సంఘ ప్రతినిధులు నరసింహమూర్తి, జానకీరామ్, గొనప లక్ష్మణమూర్తి, రామారావురెడ్డి పాల్గొన్నారు.

ప్రొఫైల్ యాప్‌పై శిక్షణ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో మెప్మా ఆర్పీలు, సీవోలకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ నడిపేన రామారావు పాల్గొన్నారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడం, మహిళా శక్తిని ఇనుమడింపు చేయాలని పిలుపునిచ్చారు. ట్రైనింగ్ సీఎంఎం మోహన్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

కాశీబుగ్గ: తమ డిమాండ్లు తీర్చాలని కోరుతూ ఎల్ఐసీ ఏజెంట్లు చేస్తున్న నిరసన దీక్షలు బుధవారం నాటికి 36వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక జీవిత బీమా సంస్థ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో ఏజెంట్ల సంఘ అధ్యక్షుడు జినగా రాజేంద్రనాయుడు మాట్లాడుతూ.. పాలసీలపై జీఎస్టీ పూర్తిగా ఎత్తివేయాలని, పాలసీ హోల్డర్లకు బోనస్, ఏజెంట్లకు కమీషన్ పెంచాలని కోరారు.

బాలుడు వైద్యానికి ఎమ్మెల్సీ దువ్వాడ ఆర్థిక సాయం



టెక్కలి: ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

టెక్కలి: సంతబొమ్మాళి మండలం కాకరాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ముడిదాన సింహాచలం కుమారుడు వైద్యానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కిడ్నీ సంబంధిత సమస్యతో జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో బాలుడు చికిత్సపొందుతున్నాడు. విషయం తెలుసుకున్న దువ్వాడ ఆస్పత్రికి బుధవారం వెళ్లి బాలుడికి అందుతున్న వైద్యంపై సిబ్బందితో మాట్లాడారు. ఎం.అప్పారావు, సీహెచ్ చిన్నారావు, పి.పాపారావు, పి.సింహాచలం ఉన్నారు.

పేద వైద్య విద్యార్థికి అండగా..



సంతబొమ్మాళి: విద్యార్థికి సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సంతబొమ్మాళి: బడేకుప్పన్నపేటకు చెందిన కేపీ స్పందన ఫౌండేషన సీతమ్మపేటకు చెందిన పేద వైద్య విద్యార్థిరొంగళి శివాజీకి బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. సుమారు రూ. 20 వేలు విలువ చేసే మొదటి సంవత్సర ఎంబీబీఎస్ రిఫరెన్స్ పుస్తకాలును హనుమంతు వెంకటరావ, గీతావాణి దంపతులు సమకూర్చగా, ఇతర విద్యా పరికరాల కొనుగోలుకు రూ.5 వేలును రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి అందజేశారు. కోర్సు పూర్తయ్యేవరకు పుస్తకాలు అందజేస్తామన్నారు. అలాగే జలుమూరు మండలం చల్లవానిపేటకు చెందిన చల్ల త్రినాథ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా..అతనికి 25 కేజీల బియ్యం, 35 రకాల నిత్యావసర వస్తువులు, వైద్యఖర్చులకు రూ. 2 వేలు అందజేశారు. స్పందన ఫౌండేషన్ అధ్యక్షులు షణ్ముఖరావు, నర్సాపురం సర్పంచ్ డి.భూషణరెడ్డి, సిమ్మన్న, ఎస్.సింహాచలం, శ్రీను ఉన్నారు.

జాబ్‌మేళాలో 40 మంది ఎంపిక



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను బుధవారం నిర్వహించారు. ఫాక్స్‌కాన్, ఏపిల్‌సెల్, స్నిడర్ ఎలక్ట్రికల్, సోలార్ పేనల్ అసెంబ్లింగ్, టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 50 మంది అభ్యర్థులు హాజరవ్వగా 40 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి, అధ్యాపక సిబ్బంది అభినందించారు. ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, కో–ఆర్డినేటర్ రమణ, ప్లేస్ మెంట్ ఆఫీసర్ హేమాచలం పాల్గొన్నారు.

నేడు ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రబీన్‌కుమార్ పాఢీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబామేళాలో పాల్గొనే అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లతో పాటు రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలతో ఉదయం పది గంటలకు హాజరు కావాలన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

ఇచ్ఛాపురం: ప్రతిఒక్కరికీ హెచ్‌ఐవీపై అవగాహన అవగాహన అవసరమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రబీన్‌కుమార్ పాఢీ అన్నారు. డిగ్రీ కళాశాల, బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో బుర్రకథ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మవల్లి, మాధవరావు, రవికుమార్, శ్రావణి ఉన్నారు.